క్లుప్తంగా

వ్యభిచార కేంద్రంపై దాడి



నిర్వహకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు గన్‌బజార్ ప్రాంతంలో వ్యభిచార కేంద్రాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఏలూరు టూటౌన్ ఎస్సై సాధిక్, సిబ్బందితో వ్యభిచార గృహంపై దాడులు చేశారు. ఈ దాడుల్లో వ్యభిచార కేంద్రాన్ని నిర్వహిస్తున్న రమణమ్మ, వినాయకనగర్‌కు చెందిన విటుడు వై.శేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వ్యభిచార కేంద్రంలోని ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకుని, వారిని హోమ్‌కు తరలించామని ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ చెప్పారు.

26, 27 తేదీల్లో చేతివృత్తిదారులకు శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 26, 27 తేదీల్లో ఏలూరులో ఏపీ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ ఏలూరు జిల్లా శిక్షణ తరగతులు స్థానిక కెనాల్ రోడ్డులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్టు కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. ఆర్ఆర్‌పేటలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ఎంపిక చేసిన 200 మంది వృత్తి సంఘాల నాయకులు, కార్యకర్తలకు రెండు రోజులపాటు శిక్షణా తరగతులను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ప్రపంచీకరణ నేపథ్యంలో కొన్ని వృత్తులు దెబ్బతింటున్నాయని, మరికొన్ని కనుమరుగవుతున్నాయని, వృత్తిదారులు ఉపాధి లేక వీధిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చేతి వృత్తుల రక్షణ, వృత్తిదారుల సంక్షేమం, సామాజిక భద్రతకు చేతివృత్తిదారులకు ఉప ప్రణాళిక ఏర్పాటు చేయాలని కోరారు. శిక్షణా తరగుతులకు సంఘ రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓలేటి శ్రీనివాస్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి హాజరుకానున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ ప్రత్తిపాటి రామకృష్ణ, చంద్రరావు, తాడిశెట్టి కాటమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

పెదపాడు: అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం చేపట్టడం మంచి పరిణామమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. మండలంలోని అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని అబ్బయ్యచౌదరి ప్రారంభించారు. ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది.

ఓట్ల పరిశీలన పూర్తి

దెందులూరు: నియోజకవర్గంలో 2,11,504 ఓట్ల పరిశీలన పూర్తయిందని దెందులూరు నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. మంగళవారం దోసపాడులో ఓట్ల పరిశీలన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ దెందులూరు మండలంలో 411 ఓటర్ల చిరునామాలు మారాయని అన్నారు. 486 ఓట్లు రెండు చోట్ల ఉన్నట్టు గుర్తించామన్నారు. 1,847 మంది వేరే గ్రామాలకు వెళ్లారని, 786 మంది గ్రామాలు వదిలి వెళ్లిపోయారని అన్నారు. నూతనంగా ఓటు హక్కు కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మండలంలో 239 బీఎల్ఓలు ఓటర్ల వెరిఫికేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు.

బకాయిలు వడ్డీతో చెల్లించాలి

ద్వారకాతిరుమల: దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలను వడ్డీతో సహా రైతులకు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని ఎం.నాగులపల్లిలో రైతు సంఘం నాయకులు పర్యటించి, దొండ పందిళ్లను పరిశీలించారు. దొండ, ఇతర కూరగాయల సాగు సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరా దొండ పందిరికి రూ.2.50 లక్షలకు పైగా పెట్టుబడి అవుతోందన్నారు. మూడేళ్లుగా వైరస్ తెగుళ్లతో పందిళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అప్పులు చేసి పందిళ్లు వేసిన రైతులకు సబ్సిడీ బకాయిలు అందకపోవడం వల్ల, చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి ఇబ్బంది పడుతున్నారన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి

ఎమ్మెల్యే ఆళ్ల నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని



హాజరైన అధికారులు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ప్రజలకు మేలు చేయటమే తమ ప్రధాన అజెండా అని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై ఆయన అధికారులతో సమీక్షించారు. నగరంలోని 3, 4, 5 డివిజన్లలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలబడుతూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరువచేయాలన్నారు. గడపగడపకు కార్యక్రమంలో వచ్చిన ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి పట్టాల మంజూరు, రేషన్ కార్డుల జారీ, కుటుంబ సభ్యుల విభజన, సదరం సర్టిఫికెట్లు, పెన్షన్లు, పారిశుధ్య సమస్యలు సత్వరమే పరిష్కరించాలన్నారు. అత్యవసరమైన ప్రాంతాల్లో డ్రెయినేజీల నిర్మాణాలు, రోడ్ల అభివృద్ధి, కల్వర్టులు వంటి ఇంజినీరింగ్ పనులకు సంబంధించి ప్రతిపాదనలు వెంటనే సిద్ధ చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమీక్షలో ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, డిప్యూటీ మేయర్ నూక పెయ్యి సుధీర్‌బాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, తహసీల్దార్ సోమశేఖర్, కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ పీఓ కృష్ణమూర్తి, ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి తదితరులు ఉన్నారు.

ధాన్యలక్ష్మీదేవిగా సౌభాగ్యలక్ష్మి దర్శనం





ధాన్యలక్ష్మీ దేవి అలంకరణలో సౌభాగ్యలక్ష్మి, సామూహిక మంగళగౌరి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిజశ్రావణ మాసం మొదటి మంగళవారం పర్వదినం సందర్భంగా స్థానిక సత్రంపాడు సౌభాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణ, మణిద్వీప వర్ణన పారాయణలు నిర్వహించారు. ఆలయంలో సామూహిక మంగళగౌరి వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ధాన్యలక్ష్మీ దేవి అలంకరణ చేశారు. పంచ హారతులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అర్చకులు వారణాశి శ్రీ రాఘవేంద్ర శర్మ విశేష పూజలు చేయగా, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వంగూరులో ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా



జీతాల పెంచాలని కోరుతూ ధర్నా చేస్తున్న కార్మికులు

ఏలూరు (టూటౌన్): అగ్రిమెంటు ప్రకారం జీతాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ పాత బకాయిలు చెల్లించాలని, ప్రస్తుత కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం పెదవేగి మండలం వంగూరు గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ ఎంఎస్ బయోటెక్ ఫ్యాక్టరీ కార్మికులు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆ వివరాలను ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు ఏలూరులో వెల్లడించారు. తొలుత మెయిన్ రోడ్డు నుంచి ఫ్యాక్టరీ గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. గేటు వద్ద ధర్నా చేశారు. జీతాలు పెంచాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డీసీఎల్ వద్ద జరిగిన అగ్రిమెంట్ ప్రకారం ఏప్రిల్ ఒకటి నుంచి జీతాలుపెంచాల్సి ఉండగా, యాజమాన్యం పెంచలేదని చెప్పారు. గతంలో కూడా ఆందోళన చేశామని, అయినా యాజమాన్యం జీతాలు పెంపుదల చేయలేదన్నారు. గౌతమి ఫ్యాక్టరీని ఎమ్మెస్ బయోటెక్ ఫ్యాక్టరీ యాజమాన్యం కొనుగోలు చేసినప్పుడు ఈఎస్ఐ, పీఎఫ్, పాతబకాయిలు మొత్తం చెల్లిస్తామని అగ్రిమెంట్లో రాసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ మేనేజర్ ఎం.నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ప్రధానకార్యదర్శి బద్దా వెంకట్రావు, ఫ్యాక్టరీ యూనియన్ ప్రెసిడెంట్ వాడపల్లి పద్మ, నాయకులు ఎ.ఆలీసమ్మ, బెజవాడ పద్మ, మోతీ భవానీ, రంగమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

దెందులూరు: జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో వినతులు స్వీకరణ ద్వారా సమస్యల పరిష్కారమే లక్ష్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయానికి దెందులూరు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల నుంచి స్వయం ఉపాధి, ఇళ్ల స్థలాలు, రుణాలు, వ్యక్తిగత అవసరాలు, రోడ్లు, ఇతర అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. వినతి పత్రాలను సంబంధిత శాఖ ఉద్యోగులకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శ

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం ఆయుష్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పోతునూరు ఎంపీటీసీ సున్నా నరేష్ బావ మద్దుల వినోద్‌ను పరామర్శించారు. ఆయనకు అందుతున్న వైద్యసేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు. దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీటీసీ సున్నా నరేష్ తదితరులున్నారు.

ఎంపీపీ దృష్టికి తాగునీటి సమస్య



రిజర్వాయర్ పంపింగ్‌పై నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్: గ్రామాల్లో తాగునీటి సరఫరా సమస్యలపై అధికారులు తక్షణం స్పందించాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం మాజీ ఎంపీపీ జయమంగళ రామరావుతో పాటు గుడివాకలంక గ్రామస్తులు ఎంపీపీని కలిసి తాగునీటి సమస్యలు వివరించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల మొండికోడు రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గి, పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా కావడం లేదని తెలిపారు. దీంతో ఎంపీపీ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, రిజర్వాయర్ కాంట్రాక్టర్ పిలిచి చర్చించారు. కాంట్రాక్టర్, ఏఈతో కలిసి దెందులూరు వద్ద పంపింగ్ సిస్టమ్ వద్దకెళ్లి పరిశీలించారు. కాలువలో తూడు, పీచు తదితర వ్యర్థాలు మోటార్ల వద్ద అడ్డుపడడం వల్ల నీటిని పూర్తిస్థాయిలో పంపింగ్ చేయలేకపోతున్నామని సిబ్బంది వివరించారు. వ్యర్థాలు అడ్డుపడకుండా కాలువలో చుట్టూ కంచె వేయాలని ఎంపీపీ సూచించారు. ట్యాంక్‌లో చేరిన వ్యర్థాలను తొలిగించాలన్నారు. అవసరమైతే మరో మోటార్ తెచ్చి నీటిని పంప్ చేసి రిజార్వాయర్ నింపాలన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో గ్రామాల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి తాగునీటి పైప్‌లైన్, ఓవర్ డెహెడ్ ట్యాంకులు నిర్మించారని, తాగునీటి సమస్య రాకూండా చూడాలని ఆదేశించారు.

ఎరువుల సంచులపై మోదీ ప్రచారం ఆపాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): ఎరువుల బస్తా సంచులపై మోదీ బొమ్మతో రాజకీయ ప్రచారాన్ని ఆపాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఏలూరు జిల్లా కమిటీ కోరింది. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో మంగళవారం నిర్వహించిన ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో సంఘం అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ, కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు మాట్లాడారు. రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రధాన్ మంత్రి భారతీయ జన్ ఉర్వరక్ పరి యోజన ద్వారా ఒకే దేశం ఒకే ఎరువుల అమలుపై ఇటీవల ఇచ్చిన సర్క్యులర్ క్రోనీ క్యాపిటలిజాన్ని ప్రోత్సహించే దుష్ట ఉద్దేశాన్ని ప్రేరేపిస్తోందని అన్నారు. మూడు దశాబ్దాలుగా సరళీకరణ, ప్రైవేటీకరణ కార్యక్రమాల ఫలితంగా ఎరువుల ఉత్పత్తిని ప్రైవేటురంగానికి అప్పగించారని ఆరోపించారు. ప్రస్తుతం ఎక్కువ శాతం ఎరువులు ప్రైవేటు కంపెనీల ద్వారా ఉత్పత్తి చేస్తున్నట్టు చెప్పారు. వాటిని మోదీ ప్రభుత్వం రాజకీయ ప్రచారానికి వాహనంగా ఉపయోగించుకోవాలనుకుంటోందని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ రంగం ద్వారా ఎన్నికల సంవత్సరంలో రాజకీయ ప్రచారానికి ప్రభుత్వ ఖజానాను ఉపయోగించుకోవటం దుర్మార్గమన్నారు. ప్రతి ఎరువుల బస్తాపై మోదీ పేరు, ఫొటో పెట్టడం ద్వారా ప్రధాని మోదీ చేయని పనికి క్రెడిట్ తీసుకొని సెల్ఫ్ ప్రమోషన్ చేసుకోవాలని ప్లాన్ చేస్తున్నారని విమర్శించారు. తక్షణం ఎరువుల బస్తాల సంచులపై మోదీ ప్రచారాన్ని ఆపాలని వారు కోరారు.

తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలి



విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న తీటౌన్ సీఐ శివాజీ

ఏలూరు టౌన్: తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలని త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ విద్యార్థులకు సూచించారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఏలూరు త్రీటౌన్ పరిధిలో కళాశాలల వద్ద ఆకతాయిల్లా తిరుగుతోన్న విద్యార్థులకు ఆయన ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ శివాజీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు శ్రమించాలని, తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయవద్దని సూచించారు. చదువుకోవాల్సిన సమయంలో ఏదైనా వివాదాల్లో చిక్కుకుని, పోలీసు కేసులు నమోదయితే భవిష్యత్తు నాశనం అవుతుందని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులు కాదని, విదేశాలకు వెళ్లేందుకు కేసులు ప్రతిబంధకాలుగా మారతాయని అవగాహన కల్పించారు. విద్యార్థులు 20 ఏళ్లపాటు కష్టపడి చదివితే జీవితంలో మరో 60 ఏళ్లు సుఖసంతోషాలతో గడిపే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. సమాజంలో గౌరవ ప్రదమైన ఉద్యోగాలు సాధించి, ఉన్నతంగా జీవించేలా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఆక్రమణదారుల పేర్లు బహిర్గతం చేయాలి



డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శినికి వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

దెందులూరు: మండలంలో పేదలకు చెందిన అసైన్డ్, సీలింగ్ ప్రభుత్వ భూములను అక్రమించిన ఆక్రమణదారుల పేర్లు బహిర్గతం చేయాలని దెందులూరు మండల డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శినిని కోరారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు, పేదలు దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం 5 దశల సర్వేల్లో భాగంగా గ్రామంలో ఉన్న అసైన్డ్, సీలింగ్, ప్రభుత్వ భూములు ఎవరెవరు ఎంత ఆక్రమించారు. ఎంత అనుభవిస్తున్నారే వివరాలను గ్రామాల వారీగా పేర్లు బహిర్గతం చేయాలన్నారు. దోసపాడులో అసైన్డ్, సీలింగ్ భూములు 300 ఎకరాలు, కొవ్వలిలో 250 ఎకరాలు భూస్వాములు అన్యాక్రాంతం చేసి అనుభవిస్తున్నారన్నారు. దెందులూరు మండల కేంద్రంలో 70 ఎకరాల ప్రభుత్వ భూమి స్థానిక భూస్వాముల చేతుల్లో ఉందన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం భూమి లేని పేదలకు భూములు పంచాలని నాయకులు రామకృష్ణ, ఆనందరావు, జాన్‌రాజు, లక్ష్మి, ఏసురాజు కోరారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత



ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించిన తీరును వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, రామశింగవరంలో కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం రామశింగవరంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పాల్గొన్నారు. రామసింగవరం పంచాయతీ దుర్గమ్మ కాలనీలో ఆయన నూకాలమ్మ దేవతకు పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు రామసింగవరం– బాదరాల రహదారిని అభివృద్ధి చేశామని, మెట్ట మీద 417 జగనన్న ఇళ్ల స్థలాలు మంజూరు చేసి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. సుమారు రూ. 8 కోట్లతో సచివాలయం, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ వంటి నిర్మాణాలు పూర్తి చేశామని చెప్పారు. రూ.15 కోట్లు వెచ్చించి గ్రామంలో ప్రజలకు కావలసిన ఆభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి గడపగడపను సందర్శించి స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాచపల్లి గంగాధరరావు, పసుమర్తి మహీంద్ర, సీతాల దాసు, అద్దేపల్లి రాంబాబు, రాచపల్లి రాంబాబు, చింతపల్లి నాగరాజు, వెన్నవెల్లి రవి, గోపిశెట్టి శ్రీను, గోపిశెట్టి రాజు, రాట్నాలమ్మ దేవస్థాన చైర్మన్ చళ్లగొళ్ళ వెంకటేశ్వరరావు, కామిరెడ్డి నాని, గోపిశెట్టి రాధమ్మ, జిల్లా నాగరాజు, బైపా ఆదాం, కంటిపూడి ధర్మరాజులు, ఆళ్ళ బాబి, యలమర్తి జయరాజు, జిల్లా వెంకటేష్, జమ్మిశెట్టి ఆంజనేయులు, సిదర్ల వరబాబు, చిలుకూరి సుబ్బారావు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	11
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

వ్యాయామ విద్యార్థుల ప్రతిభ

దెందులూరు: స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల విద్యార్థులు మరోసారి జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచారు. 2022–23 సంవత్సరానికి జాతీయస్థాయిలో సౌత్ జోన్ యూనివర్సిటీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గోపన్నపాలెం వ్యాయామ కళాశాల విద్యార్థులు 32 మంది అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. మంగళవారం గోపన్నపాలెం కళాశాలలో జాతీయ స్థాయి క్రీడా ప్రశంసాపత్రాలను ప్రిన్సిపల్ ఎస్.నత్తానియేలు అందజేశారు.

లారీ బోల్తా

పెదవేగి : జాతీయ రహదారిపై సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ మంగళవారం బోల్తాపడింది. డ్రైవర్ గాయపడ్డాడు. విజయనగరం నుంచి తెలంగాణలోని మటంపల్లికి సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ పెదవేగి మండలం అమ్మపాలెం వద్ద బోల్తా పడింది. క్యాబిన్లో ఇరుక్కుపోయిన నందిగామకు చెందిన లారీ డ్రైవర్ బి.రవిని హైవే అంబులెన్స్ అధికారులు బయటకు తీశారు. ఏలూరులోని సర్వజన ఆసుపత్రికి క్షతగాత్రుడిని తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

పెదవేగి : మండలంలోని జగనన్న లేవుట్లలో బేస్‌మెంట్ కూడా నిర్మించని గృహ నిర్మాణాలను గుర్తించి నిర్మాణాలు వేగవంతమయ్యేలా సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వెంటనే చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గంజి రాజ్‌మనోజ్ ఆదేశించారు. గృహ లబ్ధిదారులను చైతన్య వంతులను చేయాలని ఆయన సూచించారు. మంగళవారం ఎంపీడీఓ మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. గృహాలతో పాటు ప్రాధాన్యత గల వివిధ నిర్మాణ దశలలో ఉన్న సచివాలయాల నిర్మాణాలు, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. నాడు–నేడులో నిధులున్న గ్రామాల్లో అదనపు తరగతి గదులు పూర్తి స్థాయిలో నిర్మించే విధంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపీడీఓ రాజ్‌మనోజ్ ఆదేశించారు. పెదవేగి మండలంలో కొన్ని సచివాలయ, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు కోర్ట్ వివాదాల్లో ఉన్నాయని తెలిపారు. మండలంలో వంగూరు, తాళ్లగోకవరం, జానంపేట, కవ్వగుంట తదితర గ్రామాల్లో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన ఆర్‌బీకే, సచివాలయం, హెల్త్ క్లినిక్ లు వివిధ దశలలో నిలిచిపోయాయన్నారు. వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సత్వర చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇప్పటికే మండలస్థాయిలో 32 ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు పూర్తిచేసి జిల్లా స్థాయిలో పెదవేగి మండలం ప్రథమస్థానంలో నిలిచిందని ఎంపీడీవో తెలిపారు. జగనన్న కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణాలకు సమయం పడుతుందని, జగనన్న కాలనీల్లో నివాసాలుంటున్న లబ్ధిదారుల సౌకర్యార్థం డ్రెయినేజీల నిర్మాణం చేపట్టే వరకు ఇళ్లల్లో వాడే నీరు రహదారుల పైకి రాకుండా ఇప్పటి వరకు 521 వ్యక్తిగత ఇంకుడుగుంతలు నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయని రాజ్ మనోజ్ చెప్పారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ కె నాగరాజు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో రాష్ట్ర ప్రభుత్వ ఏడీసీ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఏడీసీ మేజర్ దీపక్ శర్మ మంగళవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలికి, శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

నేడు పోతునూరులో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు: పోతునూరులో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఏపీ ప్రసాద్ (బజ్జీ) అన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొనే ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీటీసీ సున్నా నరేష్‌తో పాటు ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పాల్గొంటారన్నారు.